క్లుప్తంగా

ఆర్ట్ ఫెస్టివల్‌లో గుంటూరు విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: ఒంగోలులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన ఆర్ట్ ఫెస్టివల్‌లో నగరానికి చెందిన ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. సృష్టి ఆర్ట్ అకాడమి, కళాయోజన సంయుక్తంగా ప్రపంచ రికార్డు కోసం నిర్వహించిన ఆర్ట్ ఫెస్టివల్‌లో విద్యార్థులు గీసిన పలు డ్రాయింగ్స్ నిర్వాహకులతో పాటు ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాయి. ఈ సందర్భంగా పోటీల్లో భాగంగా స్పాట్ పోర్ట్రయిట్ పెయింటింగ్‌లో బృందావన్ గార్డెన్స్‌లోని క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమి చైర్మన్ డాక్టర్ కె.పి.బాబుతో పాటు విద్యార్థులు ఎస్. చిన్ని, జి. హరిప్రియ, కె. నాగసుమ, బి. భువనేశ్వరి, కె. హైందవి, కె. నాగమణి సన్మానం పొందారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి దారుణం

పాత గుంటూరు: కావలిలో డ్యూటీలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు. గుంటూరు– 1 డిపో ఆవరణలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నేతలు సంఘటనను ఖండించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.వి. కృష్ణారావు మాట్లాడుతూ కష్టపడి ఉద్యోగం చేస్తున్న వారిపై దాడులు చేయడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా సెక్రటరీ రవిశంకర్, ఎన్ఎంయూ గ్యారేజ్ అధ్యక్షుడు సురేష్, వైఎస్సార్ సంఘ కార్యదర్శి కె.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్యపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. జొన్నలగడ్డ శ్రీకాంత్ (50) మధ్యవర్తిగా ఉండి ఏడుకొండలుకు రూ.5 లక్షలు అప్పుగా ఇప్పించాడు. ఏడుకొండలు అప్పులు తీర్చలేక గతంలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై అతడి భార్య కోటేశ్వరమ్మ తన భర్త మృతికి శ్రీకాంత్ కారణమంటూ కాకాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్ అరండల్‌పేటలోని ఓ పార్టీ కార్యాలయంలో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోలీసులు మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో మహిళకు గాయాలు

ముగ్గురు దాడి చేసిన ఘటనలో ఓ మహిళ గాయపడటంతో అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్టీఆర్ కాలనీకి చెందిన తేజ మిత్రులకు రూ. 1500 అప్పు ఉన్నాడు. దాన్ని చెల్లించమని జోసఫ్, నాని, విన్‌లు తేజ ఇంటికి వచ్చి అడిగారు. దీంతో వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. ముగ్గురు కర్రలతో దాడికి యత్నించగా తేజ తల్లి ప్రమీల అడ్డం వచ్చి గాయపడింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: కొత్త కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో నగరంపాలెం పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 28,400 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

హత్య కేసులో ఇద్దరు నిందితుల్ని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు.శ్యామలానగర్ రైల్వేగేటు సమీపంలో ఈ నెల 26న మద్యం మత్తులో ఓంకారాచారిని ఇద్దరు వ్యక్తులు పగలుకొట్టిన బీరు బాటిల్‌తో పొడిచి హత్య చేసిన సంగతి తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు జంధ్య వెంకటేశ్వరరావు, పల్లా వెంకటేశ్వర్లును ఆదివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి, రిమాండ్‌కు తరలించారు.

అనుమతి లేకుండా టీడీపీ నాయకుల నిరసన

గుంటూరు ఈస్ట్: అనుమతి లేకుండా ప్రదర్శన నిర్వహించిన టీడీపీ నాయకులపై పట్టాభిపురం పోలీసులు కేసులు నమోదు చేశారు. విద్యానగర్ మెయిన్ రోడ్డులో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. అనుమతి లేకుండా నిర్వహించడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు.

కారు ఢీకొని హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

గుంటూరు ఈస్ట్: కారు ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటనపై పశ్చిమ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. దొనకొండలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న భీమవరపు పూర్ణమహేశ్వరరావు (48) గుంటూరులోని వికాస్‌నగర్‌లో నివసిస్తున్నారు. ఆదివారం ద్విచక్ర వాహనంపై నవభారత్ నాలుగో లైన్ మెయిన్ రోడ్డుపై వెళ్తున్నారు. ఈ సమయంలో వేగంగా వచ్చిన కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన మహేశ్వరరావు ఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్జీవోల సొంతింటి కల సాకారం

- పొన్నూరులో ఎన్జీవో కాలనీకి ఎమ్మెల్యే కిలారి, ఎమ్మెల్సీ ఉమారెడ్డి ప్రారంభోత్సవం
- 230 మంది ఉద్యోగులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల పంపిణీ



ఎమ్మెల్యే రోశయ్య, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డిని సత్కరిస్తున్న ఎన్జీవో సంఘ నేతలు

పొన్నూరు: గత 25 సంవత్సరాలుగా పలు సమస్యల కారణంగా అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సొంతింటి కలను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య నెరవేర్చడం ఎంతో అభినందనీయమని ఎన్జీవో సంఘ నేతలు పేర్కొన్నారు. ఎన్జీవో అసోసియేషన్ పొన్నూరు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో కాలనీని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీ ఉమారెడ్డి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా 230 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల నివేశన స్థలాల సమస్యకు పరిష్కారం లభించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలకు కూడా త్వరలోనే పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల్ని తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే రోశయ్య ఉద్యోగులకు చేసిన మేలును ఎన్నటికీ మరువరని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రోశయ్య, ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లును ఉద్యోగ సంఘాల నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా, ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, ప్రధాన కార్యదర్శి కె.వి. శివారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, శెట్టిపల్లి సతీష్ కుమార్, ఘంటసాల శ్రీనివాసరావు, తాలూకా యూనిట్ అధ్యక్షుడు కె. ఆనంద సాయిబాబు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గోశాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి

- నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- వెంగళాయపాలెంలో షెడ్డుల నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న నగర మేయర్ కావటి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బందెల దొడ్డి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. గోవుల పరిరక్షణలో భాగంగా ఆదివారం వెంగళాయపాలెంలో గో సేవ రక్షకులతో కలసి మేయర్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో వీధుల వెంట తిరిగే ఆవులు అధికంగా ఉన్నాయని, వాటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పలు ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయని చెప్పారు. ఆవుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వాటి కోసం ప్రత్యేకంగా నగరంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వెంగళాయపాలెంలో రూ. 50 లక్షలతో షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రోడ్లపై తిరిగే ఆవుల్ని షెడ్డుకు తరలించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గుంటూరు ప్రొటెస్టింగ్ బర్డ్స్ అండ్ యానిమల్స్ అసోసియేషన్ సభ్యులు ఆవుల సంరక్షణకు సహాయ, సహకారాలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. షెడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి, ఈచంపాటి వెంకటకృష్ణ, సాదు ఉమామహేశ్వరి, గుంటూరు ప్రొటెస్టింగ్ బర్డ్స్ అండ్ యానిమల్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదీప్ జైన్, నిఖిల్ జైన్, సురేష్ జైన్, రామకృష్ణ, దర్శన్, యశ్వంత్, మహావీర్, అశోక్, భరత్, అనిల్, రాజు, ఈఈ కొండారెడ్డి, డీఈఈ కల్యాణరావు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

దొడ్డిదారిన బేరసారాలు... కార్పొరేషన్ రాబడికి గండి



నగరంలో హోర్డింగ్స్ తొలగిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులు(ఫైల్)

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో హోర్డింగ్స్, బోర్డుల నిర్వహణ కోట్ల రూపాయిల ఆదాయాన్ని చేకూరుస్తున్నా ఏజెన్సీల నిర్వాహకులు మాత్రం బకాయిలు కట్టకుండా అడ్డదారులు తొక్కుతున్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు కూడా నిర్వాహకులతో లాలూచీ పడి కార్పొరేషన్‌ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై గత నెల 29న సాక్షిలో 'అధికారుల అలసత్వం.. ఏజెన్సీల ఎగనామం' అనే కథనం కూడా ప్రచురితమైంది. నగరంలో హోర్డింగ్స్ బకాయిలు కోట్ల రూపాయల్లో పేరుకుపోవడంతో ఇప్పటికే కమిషనర్ కీర్తి చేకూరి పలు సమావేశాల్లో పట్టణ ప్రణాళిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిలు వసూలు చేయాలని, లేనిపక్షంలో హోర్డింగ్స్ తొలగించాలని హెచ్చరించారు. దీన్ని ఆసరాగా చేసుకుని పట్టణ ప్రణాళిక అధికారులు జేబులు నింపుకునే ప్రయత్నం చేస్తున్నారు. బకాయిలు లక్షల్లో ఉన్న ఏజెన్సీలను పట్టించుకోకుండా తమకు ముడుపులు సమర్పించుకోని వారి బోర్డుల్ని తొలగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.

బకాయిల వసూలులో నిర్లక్ష్యం

నగరపాలక సంస్థ హోర్డింగ్స్ బకాయిలు సుమారు రూ.3 కోట్ల వరకు ఉంది. అయితే, వాటిని వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 19, 20వ తేదీల్లో అధికార లెక్కల ప్రకారం 80 బోర్డులు తొలగించామని చెబుతున్నప్పటికీ, ఇంకా అధికంగా వందల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. తొలగించిన బోర్డులను దొడ్డిదారిన థర్డ్ పార్టీ వ్యక్తికి కాంట్రాక్ట్ కింద అప్పగిస్తున్నారు. తద్వారా సదరు కాంట్రాక్టర్‌కు రూ.కోటి దాకా ఆదాయాన్ని అధికారులు సమకూర్చారనే తెలుస్తోంది.

బకాయిలు కట్టినా బోర్డుల తొలగింపు

బోర్డుల తొలగింపులో నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారుల తీరు వింతగా ఉంది. 19, 20వ తేదీల్లో అనధికార బోర్డులు తొలగించారు. దీనిపై 21వ తేదీ రాత్రి ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఇందులో సచివాలయం సిబ్బంది డిమాండ్ రైజ్ చేసిన బోర్డులను సైతం తొలగించడంతో ఓ ఏజెన్సీ నిర్వాహకుడు గట్టిగా ప్రశ్నించాడు. 2021–22 వరకు ఉన్న బోర్డుల లిస్టుల వరకే ఉంచుతామని, వాటిల్లో కూడా బకాయిలు ఉంటే కట్ చేస్తామని పట్టణ ప్రణాళిక అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉంది. అంటే సచివాలయం సిబ్బంది డిమాండ్ రైజ్ చేసిన వాటిని పట్టించుకోరా? అని ఏజెన్సీ నిర్వాహకులు బాహాటంగానే విమర్శలు కురిపిస్తున్నారు.

షూటింగ్ బాల్ జట్టుకు ఎస్‌వీవీ హైస్కూల్ విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం దేవరాజు, పీఈటీ సుంకర శ్రీనివాస్

తాడికొండ: ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన ఏపీ అంతర జిల్లాల అండర్–14 బాలుర విభాగంలో తమ పాఠశాల విద్యార్థి రాంప్రకాష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సంపాదించినట్లు తాడికొండ ఎస్‌వీవీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పెరికల దేవరాజు తెలిపారు. పాఠశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో దేవరాజు మాట్లాడుతూ 9వ తరగతి చదువుతున్న మార్కపూడి రాంప్రకాష్ అన్నమయ్య జిల్లాలో ఈనెల 18, 19 తేదీలలో నిర్వహించి అంతర జిల్లాల పోటీలలో పాల్గొని జిల్లా జట్టులో తనదైన శైలిలో ప్రతిభ కనబరిచి సత్యసాయి, నెల్లూరు, కడప, కోనసీమ జిల్లాలపై విజయం సాధించడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించిన టోర్నమెంట్ యాజమాన్యం ప్రతిభను మెచ్చుకుని బెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ప్రత్యేక బహుమతి అందజేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థి రాంప్రకాష్‌ను , వ్యాయామ ఉపాధ్యాయులు సుంకర శ్రీనివాస్, హెచ్‌ఎంతో పాటు పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కృష్ణమాచార్య శత జయంత్యుత్సవాలు ప్రారంభం



కచేరి చేస్తున్న కౌశిక్ కల్యాణ్ బృందం

పాత గుంటూరు: లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం, కళా వేదికపై ఆదివారం కృష్ణమాచార్య కళా పీఠం కార్యదర్శి బుచ్చయాచార్యుల ఆధ్వర్యంలో సంగీత, సాహితీ శిరోమణి ఎన్.సి.హెచ్.కృష్ణమాచార్యులు శత జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హిందూ కళాశాల పూర్వ ప్రధానాచార్యులు డాక్టర్ డీ.వి. దీక్షితులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బండ్లమూడి హనుమాయమ్మ, డాక్టర్ వి.ఎస్.డి. శ్యామ సుందరీదేవి జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. డాక్టర్ దీక్షితులు మాట్లాడుతూ ఉత్తమ పురస్కార గ్రహీత ఎన్.సి.హెచ్.కృష్ణమాచార్యులు ఆకాశవాణి విజయవాడ కేంద్రానికే వన్నెతెచ్చిన సంగీత, సాహితీ శిరోమణిగా పేర్కొన్నారు. అనంతరం బృందగానంలో అన్నమాచార్య, తీరు వెంకటాచార్యులు, కృష్ణమాచార్యులు కీర్తనలను రసరమ్యంగా శాంతిశ్రీ , తుషార పూర్ణవల్లి, లక్ష్మీశ్రీహరి, సూర్యలక్ష్మి గానం చేశారు. వీరికి వయోలిన్‌పై సుబ్రహ్మణ్యరాజు, మృదంగంపై సూర్య సహకారాన్ని అందించారు. అనంతరం హైద్రాబాద్‌కు చెందిన ఏ గ్రేడ్ ఆర్టిస్ట్ కౌశిక్ కల్యాణ్ గాత్ర సంగీత కచేరి అలరించింది. వయోలిన్‌పై దినకర్, మదంగంపై సురేష్‌బాబు, ఘటంపై హరిబాబు సహకారం అందించారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



గుంటూరు రూరల్: బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఇన్నర్ రింగ్ రోడ్డులో ఆదివారం జరిగింది. సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇన్నర్ రింగ్ రోడ్డులో ఇద్దరు యువకులు మద్యం మత్తులో వాహనాన్ని నడుపుతూ ముందు వెళ్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో అక్కడే నివసిస్తున్న పల్లూరి రమేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు గమనించి అతడ్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఇంచార్జి కమిషనర్ పి.వి.కె.భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆయన సూచించారు.

వాట్సాప్ ద్వారా ఉద్యోగినులకు బెదిరింపులు

గుంటూరు ఈస్ట్: మెప్మాలో పనిచేసే ఉద్యోగినులకు ఓ వ్యక్తి వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా బెదిరించడంతో పాటు మెప్మా సంస్థ ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రచారం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మెప్మా ఉద్యోగిని ఇందిరా సుశీల సహాయంతో సంస్థ ఉద్యోగుల ఫోన్ నంబర్లు సేకరించి కర్లపూడి బాబూప్రకాష్ ఓ గ్రూపు క్రియేట్ చేశాడు. వాట్సాప్ ద్వారా మెప్మా సంస్థ ప్రతిష్టకు భంగం కల్పించడంతో పాటు ఉద్యోగినులను బెదిరిస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్‌లో మేసేజ్ పెట్టాడు. దీనిపై మెప్మా పీడీ పి.వెంకటనారాయణ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నమయ్య సంకీర్తన శిక్షణ తరగతులు

తెనాలిటౌన్: బోసు రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలోని రమా సహిత సత్యనారాయస్వామి కల్యాణ మండపంలో అన్నమయ్య సంకీర్తనలపై మహిళలకు ఆదివారం ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అన్నమయ్య వెంకటేశ్వర బృందం మహిళా కన్వీనర్ కొండపి వసుంధర మహిళలకు శిక్షణ ఇచ్చారు. అన్నమయ్య సంకీర్తనల ప్రచార నిమిత్తం శిక్షణలు ఇస్తున్నామని, ఆసక్తి ఉన్నవారు సంకీర్తనలు నేర్చుకోవాలని కోరారు. ఆదివారం సాయంత్రం 4 నుంచి 6.30 గంటల వరకు 35మంది మహిళలకు శిక్షణ ఇచ్చినట్లు వసుంధర తెలిపారు. సంకీర్తనలు నిర్వహణ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు, సభ్యులు అందె బాలచంద్రమౌళి, సురాబత్తుని కేశవరావు, మహిళలు పాల్గొన్నారు.

డ్యాన్సర్స్ అసోసియేషన్ కార్యవర్గం

నెహ్రూనగర్: నగరంలోని అరండల్‌పేటలో ఆదివారం జరిగిన సమావేశంలో ఏపీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. లోకేష్, ఉపాధ్యక్షుడిగా డి. రాజగోపాల్, సెక్రటరీగా పి. మల్లి, జాయింట్ సెక్రటరీగా ఎస్. సన్ని, ట్రెజరర్‌గా పి. రాంబాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా జి. ప్రశాంత్, కె.అఖిల్, జి. పవన్, షేక్ జాని నియమితులయ్యారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

నెహ్రూనగర్: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రజక విద్య ప్రోత్సాహక కమిటీ సభ్యుడు నూతలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. పాత గుంటూరులోని గంగానమ్మ గుడి మండపంలో ఆదివారం పేద రజక విద్యార్థులకు దుప్పట్లు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు నిడుబ్రోలు సాంబశివరావు, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొండవీటి శ్రీనివాస్, బాపట్ల శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు

ఆర్‌వీఆర్‌జేసీలో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్స్‌తో ఎన్‌సీసీ అధికారులు

గుంటూరు రూరల్: చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ ఏటీసీ ఐదో శిబిరం ఆదివారంతో ముగిసింది. శిక్షణలో 706 మంది విద్యార్థినులకు ఫైరింగ్, డ్రిల్, టగ్ ఆఫ్ వార్, వాలీబాల్, అథ్లెటిక్స్, రన్నింగ్, క్రీడా సాంస్కృతిక విభాగాల్లో శిక్షణ అందజేశారు. దేశ రక్షణపై అవగాహన, దేశభక్తి, జాతీయ గీతం ఆవశ్యకతను తెలియజేశారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులకు మెడల్స్, ప్రోత్సాహక నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభించిందని కల్నల్ నీరజ్ కుమార్ పేర్కొన్నారు. సామాజిక సేవలో, దేశ రక్షణలో వారి కర్తవ్యాన్ని నిర్వర్తించే విధంగా బాలికలు ఉత్సాహంగా శిక్షణ పొందారని ఆయన తెలిపారు. కార్యక్రమాలు విజయవంతంగా జరుపుకోవడానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసిన ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యానికి ఎన్‌సీసీ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. దేశభక్తి, సామాజిక సేవ కలిగిన పౌరులుగా బాలికల్ని తీర్చిదిద్దేందుకు తమ కళాశాల వేదిక కావడం గర్వకారణమని అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు. సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమాజ సేవలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలకు కళాశాల తరపున సహాయ, సహకారాలు అందించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. శ్రీనివాస్, డెప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ రెజిత్ ముకుందన్, క్యాంపు ఎస్.ఎం సుబేదార్ పాణ్యం రఫీ, జీసీఐ జెస్సీ జొరాల్డ్, 10 ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ సూపరింటెండెంట్ రాజశేఖర్ బాబు, క్యాంపు ట్రైనింగ్ జేసీవో నాయబ్ సుబేదార్ షేక్ ఖాజావలి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ తారాచంద్, డాక్టర్ ఉషాక్రాంతి పాల్గొన్నారు.

జాతీయ క్విజ్ పోటీలకు నారాకోడూరు విద్యార్థి ఎంపిక



విద్యార్థి ఆదిత్యవర్ధన్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చేబ్రోలు: మండలంలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి ఆదిత్యవర్ధన్ ఆన్‌లైన్‌లో జరిగిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ ఎడ్యుకేషన్ టీసీఎస్ నేషనల్ లెవెల్ రూరల్ ఐటీ క్విజ్‌లో ఆదిత్యవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలో ప్రతిభ కనబరచడంతో నవంబర్ ఒకటో తేదీన ఆన్‌లైన్‌లో జరిగే జాతీయ స్థాయి ఐటీ క్విజ్‌కు ఆంధ్రప్రదేశ్ తరపున ఎన్నికైనట్లు ఎస్‌సీఆర్‌టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ప్రకటించినట్లు హెచ్‌ఎం ఎం. ఏడుకొండలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య వర్ధన్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించినట్లు ఆయన పేర్కొన్నారు.

న్యూజిలాండ్‌లో ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు



న్యూజిలాండ్‌లో స్థానిక ఎంపీలతో శాంతమూర్తి

గుంటూరు ఎడ్యుకేషన్: న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ వేడుకల్లో గుంటూరులోని అమరావతిరోడ్డుకు చెందిన అవర్ స్టేట్ అవర్ లీడర్, వైఎస్సార్ ఇంటిలెక్చ్యువల్ ఫోరం సంస్థల వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి పాల్గొన్నారు. న్యూజిలాండ్‌లోని మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ (మాటా) ఆధ్వర్యంలో తెలుగు ప్రజలు జరుపుకున్న వేడుకలకు స్థానిక ఎంపీలు గ్లాసెన్ మెలీసా లీ అన్నా, హెలీవైట్ హాజరయ్యారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్న వేడుకల్లో రాష్ట్రావతరణకు మూల కారకుడైన పొట్టి శ్రీరాములు త్యాగం, ఆయన చేసిన ఆమరణ నిరాహార దీక్ష గురించి స్మరించుకున్నట్లు శాంతమూర్తి తెలిపారు. వేడుకల్లో వెయ్యి మందికి పైగా పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు.

ప్రాచీన సంస్కృతులు జీవన ప్రామాణిక నడవడికలు



నోరి నారాయణమూర్తిని సత్కరించిన సంఘ నేతలు

తెనాలి: ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు మన జీవన ప్రామాణిక నడవడికలని, వీటిని మన మహర్షులు వేదాలు, పురాణాలు, కావ్యాల్లో విపులీకరించారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు 'గాన కళా ప్రపూర్ణ' బ్రహ్మశ్రీ నోరి నారాయణమూర్తి అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తెనాలి సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని సంఘ భవనంలో జరిగింది. సంఘ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'భాగవతం–కృష్ణుడు–కుచేలుడు' అనే అంశంపై నారాయణమూర్తి ప్రత్యేక ప్రసంగం చేశారు. ప్రతి మానవుడు ధర్మార్థ కామ మోక్షాలు సాధించాలని చెబుతూ భగవంతుడిని నమ్మిన వారికి, గరుడ సేవ చేసిన వారికి సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. స్నేహానికి తరతమ భేదాలు లేవని నిరూపించిన భక్తి జ్ఞాన స్నేహతత్వమైన శ్రీకృష్ణ కుచేలుని దివ్య కథను బమ్మెర పోతన రచించినట్లు తెలిపారు. అనంతరం నారాయణమూర్తిని ఘనంగా సత్కరించారు. నివేదికను చలమయ్య ప్రవేశపెట్టారు. ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు పర్యవేక్షించిన సభలో సీతారామయ్య, హనుమారెడ్డి, నాగేంద్రయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టాలి

నెహ్రూనగర్: ఏపీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపడుతున్న విధంగానే దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. ఓ ప్రైవేటు కార్యక్రమానికి గుంటూరు వచ్చిన సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్. రఘువీరారెడ్డిని బీసీ సంఘ నాయకులు ఆదివారం కలసి వినతి పత్రం అందజేశారు. ప్రతిపక్ష పార్టీగా లోక్‌సభ, రాజ్యసభల్లో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి 2024లో కులగణన చేపట్టే విధంగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశంలో తీర్మానం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఏపీలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కుమ్మర క్రాంతికుమార్, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతకు నా మట్టి- నా దేశం దోహదం

సేకరించిన మట్టితో ఢిల్లీ వెళ్లిన బీజేపీ నేతలు



ఢిల్లీ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకున్న నేతలు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు నా మట్టి– నా దేశం కార్యక్రమంలో భాగంగా ఈనెల 31న ఢిల్లీలో జరిగే అమృతత్ కలశ యాత్రకు జిల్లా నుంచి బీజేపీ నాయకులు ఆదివారం విజయవాడ నుంచి ప్రత్యేక రైలులో ఆదివారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. జిల్లాలోని 37 మండలాల్లో ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి పవిత్ర కలశాలలో నింపి ఢిల్లీలోని అమృత వనానికి కలశాలను చేర్చేందుకు 65 మంది గుంటూరు నుంచి బయలుదేరినట్లు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర తెలిపారు. కార్యక్రమంలో నేతలు ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, రాచమల్లు భాస్కర్, వెలగలేటి గంగాధర్, ఈమని మాధవరెడ్డి సరోజిని, స్వాతి, లక్ష్మి పాల్గొన్నారు.